# మొగుళ్ళు - పెళ్ళాలు

సనత్‌నగర్‌లో ఉన్న ఓ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు సన్యాసిరావు.... అతని భార్య సువర్చల సెక్రటేరియట్‌లో టైపిస్టు !

పొద్దున్న ఎనిమిదింటికి టిఫిన్ తినేసి, తన స్కూటరు మీద కంపెనీకి బయల్దేరతాడు సన్యాసి రావు.... వెళ్ళేదారిలో నాలుగేళ్ళ కూతుర్ని 'సెంట్ ఆన్స్' స్కూల్లో దిగబెడతాడు.... అప్పటికి ట్రాఫిక్ అంత ఎక్కువగా వుండదు కనుక ఇరవై నిమిషాల్లో కంపెనీకి చేరుకుంటాడు....

మధ్యాహ్నం అక్కడి క్యాంటిన్ భోంచేస్తాడు... తిరిగి సాయంత్రం నాలుగున్నరకి ఫాక్టరీలో డ్యూటీ అయిపోగానే స్కూటరెక్కి అయిదయ్యే సరికి సెక్రటేరియట్ దగ్గరకు వస్తాడు.

అప్పటికి సెక్రటేరియట్ దగ్గర బస్‌స్టాప్‌లో సువర్చల వెయిట్ చేస్తూంటుంది... ఆమెను స్కూటరుమీద ఎక్కించుకుని ఇంటికొచ్చే సరికి అయిదుంబావవుతుంది....

మధ్యాహ్నం మూడున్నరకి స్కూలు విడిచిపెట్టాక— అట్నించి అటే టీచరుగారింటికి ట్యూషనుకి వెళ్ళి- వాళ్ళ పాప కూడా— మరో అరగంటకు ఇంటికి చేరుకుంటుంది.

ఎప్పటిలాగే ఆరోజు సాయంత్రం ఫ్యాక్టరీలోంచి బయటపడి స్కూటరెక్కాడు సన్యాసిరావు... పద్మవ్యూహంలాంటి ట్రాఫిక్కును తప్పించుకుంటూ నెమ్మదిగా సెక్రటేరియట్ దగ్గరకు చేరుకున్నాడు. అక్కడబస్‌స్టాప్‌లో స్కూటరు ఆపగానే, ఆమెవచ్చి స్కూటరెక్కి కూర్చుంది... తనకుడిచేతిని అతని నడుంచుట్టూవేసి బిగించింది... స్కూటరు బయల్దేరింది.

మరో పావుగంటకు- విజయనగరకాలనీలో తమ ఇంటి దగ్గర స్కూటరు ఆపాడు సన్యాసిరావు.

వెనకాల కూర్చున్న ఆమె చటుక్కున క్రిందకుదిగి-

'ఇక్కడకు తీసుకొచ్చారేమిటీ?'— అని అడిగింది.

ఆగొంతువిన్న సన్యాసిరావ్ ఉలిక్కిపడ్డాడు... గభాల్న వెనక్కి తిరిగి ఆమెను చూశాడు... ఆమె తన భార్య సువర్చల కాదు!!

'మీరు... మీరు సువర్చల.... కాదా ?'— తెల్లబోతూ, తడబడుతూ అడిగాడు ఆ క్షణంలో అతన్ని చూసిన ఆమెకూడా షాకైంది.

'మీరు... మీరు వారు కాదా ?'— అంది భయంగా. ఆమె నుదుటి మీద చెమట బిందువులు కనిపిస్తున్నాయి.

'వారా వారెవరు ? అసలు మీరెవరూ ?.... నా బండి మీద ఎందుకు ఎక్కారు ?'— గబగబా అడిగేశాడు సన్యాసిరావు.

'నా పేరు జమునారాణి! సెక్రటేరియట్‌లో క్లర్కుగా పనిచేస్తున్నాను. మావారు ఛీఫ్ ఇంజనీరు ఆఫీసులో సెక్షనాఫీసరు!.... మేం సీతారాంబాగ్‌లో వుంటాం !.... రోజూ ఆఫీసు కాగానే ఆయన ఇక్కడకు వచ్చి నన్ను పికప్ చేసుకుంటారు!'— ఆమె కూడా గబగబా చెప్పేసింది

'అదిరైటేనండీ! . మిమ్మల్ని ఎవరు 'పికప్' చేసుకుంటే నాకేమిటీ ? నాబండి మీద ఎందుకు ఎక్కారూ ? అని అడుగుతున్నా....' అంటూ చిరాకుపడిపోయాడు సన్యాసిరావు.

'మావారిది కూడా అచ్చం ఇలాంటి నీలంరంగు స్కూటరే!.... ఈ స్కూటరు అక్కడ ఆగేసరికి— మావారే అనుకుని ఎక్కేశాను!'.

'బలేవారే!.... నీలంరంగు స్కూటర్ల వాళ్ళంతా మీ మొగుళ్ళే అనుకున్నారుకాదు!'— జోక్ పేల్చాననుకుని వెకిలిగా నవ్వుకున్నాడు.

'షటప్! కుళ్ళు జోకులెయ్యకండి!'— ఆమె రుద్రకాళిలా మారిపోయింది. సన్యాసిరావ్ కొంచెం తగ్గాడు.

'అదికాదండీ! స్కూటరుచూసి ఎక్కేస్తే ఎలా ?.... వచ్చింది మీభర్తో కాదో చూసుకోవద్దూ ?'— నెమ్మదిగా అడిగాడు.

'చూసే ఎక్కాను! మావారిది కూడా అచ్చం మీరుపెట్టుకున్న హెల్మెట్ లాంటిదే!... ముదురునీలం!... స్కూటరు రంగూ, హెల్మెట్ రంగూ చూసుకున్నానేకానీ- ముఖంలోకి పరిశీలనగా చూడా లనుకోలేదు.... అయినా అసలు బండి వెనకాల ఎవరు ఎక్కారో చూసుకోవాల్సిన బాధ్యత మీకుమాత్రం లేదా?....'— సీరియస్‌గానే అడిగింది జమునారాణి.

'నాకు ఆ అవసరంలేదు! అక్కడ స్టాప్‌లో స్కూటరు ఆపగానే మా ఆవిడ వచ్చి వెనకాల కూర్చుంటుంది.... తను కూడా సెక్రటేరి యట్‌లో టైపిస్ట్‌గా పనిచేస్తోంది!'— చెప్పాడతను.

'సర్లెండి! .. చేసిన నిర్వాకం చాలుగానీ— తొందరగా స్కూటర్ వెనక్కితిప్పండి... సెక్రటేరియట్ దగ్గర మీకోసం మీఆవిడా- నాకోసం మా ఆయనా వెయిట్ చేస్తూంటారు పాపం!'

సన్యాసిరావ్ మళ్ళీ స్కూటరు వెనక్కి తిప్పాడు.... ఆమె వెనకాల ఎక్కికూర్చుంది. ఇప్పుడు అతనికి బాగా ఎడంగా— సాధ్య మైనంతవరకూ అతనికి తన చీర చెంగుకూడా తగలనంత జాగ్రత్తగా కూర్చుంది.

'నయమే!... నేను శ్రీరామచంద్రుడంతటి మంచివాణ్ణి కనుక సరిపోయింది... అదే, కనక ఏ దుర్మార్గపు ఆలోచన ఉన్నవాడో అయ్యుంటే— మిమ్మల్ని ఈపాటికి ఊరిపొలిమేరల్లో ఉండే ఏ పాడు పడిన కొంపలోకో తీసుకుపోయి— సినిమాల్లో హీరోయిన్‌ని- విలన్ బలాత్కారించినట్టుగా...' స్కూటరు డ్రైవ్ చేస్తూనే— మళ్ళీ జోక్ వేస్తున్న గర్వంతో నవ్వేశాడు సన్యాసిరావు.

పది నిమిషాల్లో స్కూటరు సెక్రటేరియట్ దగ్గరకు చేరుకుంది. అక్కడ బస్‌స్టాప్‌లో ఇప్పుడు ఎక్కువ జనంలేరు.... ఉన్నజనంలో తన భార్య కనిపించలేదు సన్యాసిరావుకి.... తనభర్త కనిపిస్తాడన్న ఆశతో ఎదురుచూసిన జమునారాణికి కూడా నిరాశే మిగిలింది....

ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

'మీరిక్కడ కనిపించక పోయేసరికి- బస్సులో వెళ్ళిపోయుండచ్చనుకుని– బహుశా మీవారు ఇంటికి వెళ్ళివుంటారు!' అన్నాడతను...

'మీ శ్రీమతి కూడా- మీరు రాలేదనుకుని- ఈపాటికి బస్సులో ఇంటికి చేరిపోయివుండాలి!'– అందామె...

'ఏది ఏమైనా జరిగిన పొరపాటులో మనిద్దరిదీ తప్పులేదు కనుక- ఒకరికొకరు సారీ చెప్పుకునే ప్రసక్తిరాదు... కనుక మీదారిన మీరు బస్సుఎక్కేయండి.... నేను లాగించేస్తాను.... బై!'– అంటూ ఆమెకు వీడ్కోలు చెప్పి వెనుతిరిగాడు సన్యాసిరావు.

అతనికి చాలా చిరాగ్గావుంది.... జరిగిన సంఘటనతో బుర్ర వేడెక్కిపోయింది. కాసేపు చల్లబడదామని బార్లో దూరాడు. వరస పెట్టి రెండు బీర్లుతాగాడు.... తాగివెడితే సువర్చల తిడుతుందని తెలుసు కనుక, అన్నంపెట్టదనికూడా గుర్తుందికనుక- హాయిగా ఓ చికెన్ బిర్యానీ కూడా తినేశాడు.... అటు పిమ్మట పుదీనా ఎక్కువేయించు కున్న 'రామ్‌ప్యారీపాన్' బుగ్గను బిగించాడు....

ఇంటికొచ్చి తలుపుతట్టాడు సన్యాసిరావు....

సువర్చల తలుపు తీసింది....

ఆమెను 'పికప్' చేసుకునేందుకు రాకపోగా- తప్పతాగివచ్చినందుకు సువర్చల అక్షింతలు వేస్తుందన్న భయంతో- నెమ్మదిగా లోపలకు తడబడుతూ అడుగుపెట్టిన సన్యాసిరావు, తన పాదాలమీద వాలిపోయిన సువర్చలనుచూసి దిగ్భ్రాంతి చెందాడు.

'నన్ను క్షమించండీ!.. ఇంకెప్పుడూ ఇలా తొందరపడను!'- అంది ఏడుస్తూ....

ఆడైలాగులోని అంతరార్థం ఏమిటో అతనికి బొత్తిగా అర్థం కాలేదు...

'ఎలాతొందరపడ్డావ్ ?.... అసలేం జరిగిందీ ?'- అన్నాడు గంభీరంగా.

'మీస్కూటరనుకుని- ఎవరి స్కూటరుమీదో ఎక్కేశాను !'- చెప్పిందామె.

'హా!'-షాకయ్యాడు సన్యాసిరావు. తాగిన బీర్లతాలూకు మత్తంతా తక్కున దిగిపోయింది.

'ఔనండీ! ఎప్పటిలాగానే- నిన్న సాయంత్రం సెక్రటేరియట్ దగ్గర బస్‌స్టాప్‌లో మీకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాను... అంతలో 'రయ్' మంటూ ఓనీలంరంగు స్కూటరొచ్చి ఆగిందక్కడ!... ఆ స్కూటరుమీదనున్న మనిషికూడా మీ హెల్మెట్ లాంటిదే- నీలంరంగుది పెట్టుకున్నాడు.... అతను మీరే అనుకుని- ఆ స్కూటరు వెనకాల ఎక్కేశాను!...'

'ఏడవలేకపోయావ్ ?' కోపంగా అన్నాడు సన్యాసిరావ్...

'విషయం తెలిశాక నాకెంత ఏడుపొచ్చిందో తెలుసా ?.... అతను స్కూటర్ని మనింటివైపు కాకుండా మరోవైపు తీసుకుపోతూంటే అనుమానంవచ్చి చూశాను. అతను మీరుకాదని తెలిసి- కెవ్వున

అరిచాను.... 'అరిచావంటే ప్రాణం తీస్తాను' అంటూ నన్ను బెదిరించి ఇంకా స్పీడుగా స్కూటర్ని పోనిచ్చి ఊరిచివర...' ఏడుపు ఎక్కువై సువర్చలకు నోట మాట రాలేదు.

'ఆ !.... ఊరిచివర ?' గద్దించి మరీ అడిగాడతను.

'ఊరిచివర పాడుబడిన గుడిదగ్గరకు తీసుకెళ్ళాడు !'– మళ్ళీ ఎక్కిళ్ళు ఆమె మాటలకు అడ్డంపడ్డాయి.

'ఊ !.... తీసుకెళ్ళి ?' అసహనంగా అడిగాడు సన్యాసిరావు.

'నన్ను.... నాచెయ్యి పట్టుకుని బలవంతం చేయబోతే- నేను ఏడుస్తూ కేకలుపెట్టాను.... అదృష్టం బావుండి రోడ్డుమీద వెడుతున్న ఓ పెద్ద మనిషి నా కేకలు విన్నాడు. పరుగెత్తుకుంటూ వచ్చాడు.... ఆయన్ని చూసి ఆ దుర్మార్గుడు స్కూటరెక్కి పారిపోయాడు !'– చెప్పటం ముగించి కళ్ళు తుడుచుకుంది సువర్చల.

'అంతేనా ? .... ఇంకేం జరగలేదని నమ్మమంటావా ?'- ఆవేశంగా అడిగాడు సన్యాసిరావు...

'నిజమండీ ! మన పాప మీద ఒట్టు !... ఇంకేదైనా జరిగివుంటే నా మొహం మళ్ళీ మీకసలు చూపించేదాన్నికాదు... అక్కడే పాడు బడిన నూతిలో దూకి ఆత్మహత్మ చేసుకునేదాన్ని'– అంటూ మళ్ళీ ఏడుపు ప్రారంభించింది...

ఆ రాత్రి తెల్లవార్లూ ఆమెను ఓదార్చటంతోనే సరిపోయింది సన్యాసిరావుకి...!!

* * *

ఆంధ్రప్రభ
7-10-87